జీవీఎంసీ స్థాయి సంఘం ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులదే గెలుపు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖ నగరపాలక సంస్థ స్థాయి సంఘం ఎన్నికలు బుధవారం జీవీఎంసీ కార్యాలయంలో సాధారణ ఎన్నికలను తలపించేలా జరిగాయి. అధికార వైసిపి పెద్దలంతా మేయర్ హరి వెంకట కుమారి ఛాంబర్‌లో మఖాం వేసి దాదాపు నాలుగు గంటల పాటు అభ్యర్థులకు ఓటింగ్‌పై తాకీదులిచ్చారు. సాక్షాత్తు మంత్రి అమర్నాథ్ రంగంలోకి దిగారు. ఎమ్మెల్యే అవంతి శ్రీనివాస్, ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కేకే రాజు, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కట్టమూరు సతీష్‌తోపాటు మేయర్ హరి వెంకట కుమారి భర్త శ్రీనివాస్ మంత్రాంగం నడిపారు. క్రాస్ ఓటింగ్ పడకుండా సభ్యులంతా తమ మద్దతుదారులతో కలిపి స్థాయి సంఘం పదిమంది వైసిపి అభ్యర్థులను గెలిపించుకునేందుకు గత పది రోజులుగా వైసిపి మాక్ పోలింగ్ కూడా నిర్వహించింది. జీవీఎంసీలో 98 వార్డుల్లో 21వ వార్డు అభ్యర్థిగా గెలుపొందిన వంశీకృష్ణ శ్రీనివాస్ ఎమ్మెల్సీ కావడంతో ప్రస్తుతం ఆ వార్డు కార్పొరేటర్‌కు ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఖాళీ అయింది. 97 మంది సభ్యుల్లో బుధవారం జరిగిన ఎన్నికల్లో 89 మంది ఓట్లు వేశారు. ఈ స్థాయి సంఘం ఎన్నికలను వామపక్షాలు, జనసేన బహిష్కరించాయి. సిపిఐ కార్పొరేటర్ ఏజే స్టాలిన్, సీపీఎం కార్పొరేటర్ గంగారావు పాల్గొనలేదు. జనసేన నుండి నలుగురు కార్పొరేటర్లు పీతల మూర్తి యాదవ్, బిశెట్టి వసంతలక్ష్మి, దల్లి గోవిందరాజు, కందుల నాగరాజు కూడా ఈ ఎన్నికల్లో పాల్గొనలేదు. వైసీపీ అభ్యర్థులు కెల్ల సునీత, కంపా హనుక్ విదేశీ పర్యటనలో ఉండడం వల్ల ఈ ఎన్నికల్లో పాల్గొలేదు. దీంతో ఎనిమిది మంది సభ్యులు ఎన్నికల్లో ఓటు వేయలేదు. 89 ఓట్లలో వైసిపి అభ్యర్థి ఊరుకూటి నారాయణరావుకు అత్యధికంగా 66 ఓట్లు రాగా, అక్రమాని పద్మకు 64, పీలా లక్ష్మీ సౌజన్యకు 64, కోడిగుడ్లు పూర్ణిమకు 63, కంటిపాము కామేశ్వరికి 63, బల్లు లక్ష్మణరావుకు 63, భూపతి రాజు సుజాతకు 63, గుడ్ల విజయసాయికి 62, బట్టు సూర్యకుమారికి 62, చల్ల రజినీకి 61 ఓట్లు రావడంతో పదిమంది వైసిపి అభ్యర్థులు గెల ుపొందారు. టిడిపి అభ్యర్థులు నొల్లి నూక రత్నకు 24, పిసిని వరాహ లక్ష్మీనరసింహం కి 28, పిల్ల మంగమ్మ కు 25, బొమ్మిడి రమణ కు 28 , మద్దిల రామలక్ష్మి కి 27, ముక్కా శ్రావణి కి 26 , సరగడం రాజశేఖర్ కు 24, గంధం శ్రీనివాసరావుకు 25, గోడి విజయలక్ష్మి కి 24, బల్ల శ్రీనివాసరావు కు 28 ఓట్లు దక్కాయి. బిజెపి 48 వార్డు కార్పొరేటర్ గంకల కవిత ఓటు ను వైసిపి మద్దతుదారులకి వేసినట్లు తెలుస్తుంది. అలాగే 60వ వార్డు పీవీ సురేష్ ను ఇటీవల వైసిపి పార్టీ నుండి సస్పెండ్ చేసింది ఆయన కూడా వైసీపీకే ఓటు వేశారు. టిడిపి నుండి సస్పెండ్ అయిన 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవింద్ రెడ్డి, 86 వార్డు కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు కూడా వైసీపీకే ఓటేశారని తెలుస్తుంది. పూర్తిస్థాయి బలం వైసీపీకి ఉన్నప్పటికీ క్రాస్ ఓటింగ్ భయంతోనే ఈ స్థాయి సంఘం ఎన్నికలకు నేతలంతా రంగంలోకి దిగినట్లు తెలుస్తుంది.

బెదిరించి లొంగదీసుకున్నారు...

క్రాస్ ఓటింగ్ భయంతోనే వైసిపి మంత్రి, ఎమ్మెల్యేలు, నాయకులు ఎన్నికలు జరుగుతున్న సమయంలో జీవీఎంసీ కార్యాలయంలోనే మఖాం వేసి ఎన్నికలను అపహాస్యం చేశారని టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాస్ ఆరోపించారు. ఓటింగ్ అభ్యర్థులకు స్లిప్పులపై నెంబర్లు వేయడాన్ని టీడీపీ కార్పొరేటర్లంతా తీవ్రంగా వ్యతిరేకిస్తూ కమిషనర్ ఛాంబర్ వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. కార్పొరేటర్ లను బెదిరించి భయభ్రాంతులకు గురి చేశారని ఆరోపించారు. ఓటమి భయంతో వైసిపి నేతలంతా అధికార యంత్రాంగాన్ని గుప్పెట్లో పెట్టుకుని ఎన్నికలు జరిపారని, వీటిని రద్దు చేయాలని నినాదాలు చేశారు.

గంగవరం పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు

విశాలాంధ్ర - విశాఖ : అదానీ గంగవరం పోర్టు కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం జోక్యం చేసుకొని పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిల్ల పైడిరాజు డిమాండ్ చేశారు. గంగవరం పోర్టు కార్మికుల నిరవధిక నిరసన దీక్షలకు సంఘీభావంగా సీపీఐ విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. కనీస వేతనం 36వేలు చెల్లించాలని 16 రోజులుగా గంగవరం పోర్టు కార్మికులు నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారని తెలిపారు. దీన్ని పోర్టు యాజమాన్యం పట్టించుకోకపోగా, 29 మందిని విధులకు హాజరుకావద్దంటూ బెదిరింపులకు పాల్పడటం దుర్మార్గమని విమర్శించారు. 14 సంవత్సరాలకు పైగా విధులు నిర్వహిస్తున్న కార్మికులకు 13 నుంచి 16 వేలు, 5, 10 సంవత్సరాల నుంచి పని చేస్తున్న కార్మికులకు 9 నుంచి పదివేల మధ్య వేతనం చెల్లిస్తున్నారని అన్నారు. వారి డిమాండ్ మేరకు నెలకు కనీసం 36వేలు వేతనం చెల్లించాలని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు చెందిన 11 వేల ఎకరాలు తీసుకుని గంగవరం పోర్టు ఏర్పాటు చేశారని తెలిపారు. పోర్టు ఏర్పాటు వల్ల గంగవరం ప్రాంత మత్స్యకారులు చేపల వేటకు దూరమై ఉపాధి కోల్పోయారని గుర్తు చేశారు. కొన్ని సంవత్సరాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేతుల్లోకి రావలసిన పోర్టును రాష్ట్ర ప్రభుత్వం అప్పనంగా అదానీకి కట్టబెట్టిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.విమల, కసిరెడ్డి సత్యనారాయణ, షేక్ రెహమాన్, జి.రాంబాబు, పి.చంద్రశేఖర్, సమితి సభ్యులు ఎం డి బేగం, ఎస్ నాగభూషణం, పి.గోవింద్, వై.రాంబాబు, యు.నాగరాజు, కె.లక్ష్మణరావు, ఎం.శ్రీనివాస్, జి.కాసులరెడ్డి, ఎ.రవి తదితరులు పాల్గొన్నారు.

బురదమయంగా 516 హైవే రోడ్డు

విశాలాంధ్ర - డుంబ్రిగూడ: మండలంలోని గత మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. మంగళవారం రాత్రి భారీగా వర్షం కురవడంతో బల్లుగూడ సమీపంలోని కొత్తవలసలో నూతనంగా నిర్మిస్తున్న 516 హైవే రోడ్డులో నిర్మాణదారులు మట్టి వేసి వదిలేయడంతో పూర్తిగా బురదమయంగా మారింది. ఈ రోడ్డు గుండా వచ్చే వాహనాలు బురదలో కూరుకుపోవడంతో వాహన రాకపోకలకు పూర్తిగా అంతరాయం ఏర్పడింది. బుధవారం ఉదయం తెల్లవారు నుంచి మధ్యాహ్నం వరకు వందల సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. అరుకు, పాడేరు వైపు నుంచి వచ్చిన వాహనాలు ఎటు వెళ్లలేక నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి అసంపూర్తిగా వదిలేసిన హైవే రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని గిరిజనులు, వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - పరవాడ: అనారోగ్యంతో మృతి చెందిన స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం అందించి స్నేహ బంధాన్ని చాటుకున్నారు 1998-99 పదోతరగతి విద్యార్థులు.

పరవాడ బీసీ కాలనీకి చెందిన గుడివాడ గంగరాజు సెలూన్ షాపుపై జీవనం సాగిస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. గంగరాజు కుటుంబం ఆర్థిక పరిస్థితులను గుర్తించి అతనితో పదోతరగతి చదువుకున్న తోటి విద్యార్థులు ఆదుకునేందుకు ముందుకొచ్చారు. తమ వంతు సాయంగా రూ.70వేలు సేకరించారు. బుధవారం ఆనగదు మొత్తాన్ని గంగరాజు భార్యకు మోటూరు హరి, చుక్క గోపి, పైల శ్రీను తదితరులు అందజేసారు.

నక్కపల్లి సీఐగా అప్పన్న

విశాలాంధ్ర - యస్.రాయవరం: నక్కపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా జి.అప్పన్న ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వి.నారాయణ రావును అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ కార్యాలయంలో డిసిఆర్‌బి సిఐగా బదిలీ చేశారు. అదే స్థానంలో పనిచేస్తున్న జి.అప్పన్నను నక్కపల్లి సిఐగా నియమించారు. దీంతో బుధవారం అడ్డరోడ్డు సర్కిల్ కార్యాలయంలో బదిలీ అయిన సిఐ నారాయణరావు నుంచి బాధ్యతలు స్వీకరించి సర్కిల్ పరిధిలోని సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కోటవురట్ల ఎస్సై నారాయణరావు, ఎస్.రాయవరం పొన్నాడ ప్రసాద్ రావు, నక్కపల్లి ఎస్సై శిరీష తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 6929 ధ్రువపత్రాల పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లాలో బుధవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 6,929 దృవపత్రాలు పంపిణీ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 13 మండలాల పరిధిలోని 18 సచివాలయాల్లో జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరాలు నిర్వహించామన్నారు. 14,302 గృహాల నుంచి వాలంటీర్ల యాప్‌లో వివిధ సర్టిఫికెట్ల కోసం 14,828 వినతులు రాగా, 20,842 టోకెన్లు నమోదు చేయడం జరిగిందన్నారు. 17,428 దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడం జరిగిందని, అందులో 6,929 సర్టిఫికెట్లు పంపిణీ చేశామని తెలిపారు.

లబ్ధిదారులకు మొక్కలు పంపిణీ

విశాలాంధ్ర - అనంతగిరి: అనంతగిరి మండలం వేంగడ పంచాయతీ పరిధి గ్రామాలలో డొంకపుట్టు, పెనంతి, మెట్టపాడు, చీడివలస, బాంజోడ గ్రామాలలో జాతీయ ఉపాధి హామీ లబ్ధిదారులకు వేంగడ మాజీ సర్పంచ్ శివేరి కొండలరావు, టీపీ చలం, కొండలరావు, సూపర్ సర్పంచ్ బుట్టన్న ఆధ్వర్యంలో సిల్వర్ ఓక్ మొక్కలు, సీత పల్లం మొక్కలు పంపిణీ చేశారు. 36 ఎకరాలకు గాను 36 మంది గిరిజన రైతులను గుర్తించి మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్పీలు క్రిష్ణ, గురుమూర్తి పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ పథకాలే సీఎం లక్ష్యం

విశాలాంధ్ర - కె.కోటపాడు: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందాలనే ముఖ్య ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ అన్నారు. మండలంలోని ఆర్‌వై అగ్రహారం, ఆర్ఎస్ పాలెం గ్రామ సచివాలయాలు వద్ద బుధవారం జగనన్న సురక్ష నిర్వహించారు. ఆర్‌వై అగ్రహారంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ మాట్లాడుతూ 250 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి నాగలక్ష్మి, ఎంపీడీవో శశి దేవి, డిప్యూటీ తహశీల్దార్ జె.రమేష్ బాబు, సర్పంచ్ కన్నూర్ లక్ష్మీ నాగభూషణం, వైసీపీ మండల కన్వీనర్ రాజేష్, ఎంపీటీసీ వై.పైడిమ నాయుడు, వైస్ సర్పంచ్ లెక్కల అచ్చం నాయుడు, వీఆర్వో కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

మెయిన్‌రోడ్డుపై మురుగు ప్రవాహం

విశాలాంధ్ర - తగరపువలస: జీవీఎంసీ అధికారులకు స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులపైనే శ్రద్ధ తప్ప, వాస్తవానికి స్వచ్ఛతకు దూరంగా ఉంది అనడానికి తగరపువలస మెయిన్ రోడ్‌పై పారుతున్న మురుగునీరే నిదర్శనమని టీడీపీ పార్లమెంటరీ సెక్రటరీ పిట్ట సురేష్ అన్నారు. వర్షం పడినప్పుడు రోడ్లపై నీరు కాలువల్లోకి వెళ్లడానికి బదులు తగరపువలస మెయిన్ రోడ్ లో కాలువలోని మురుగునీరు, వ్యర్థాలు రోడ్లపై ప్రవహించే నూతన విధానానికి అధికారులు తెర తీశారనే చెప్పాలన్నారు. లక్షల రూపాయలు ఖర్చుచేసి మెయిన్ రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన ఓపెన్ డ్రైన్ (కాలువలు)ను సిమెంట్ పలకలతో కప్పేసి, ఆక్రమణలు చేసి దుకాణాలు పెట్టుకొని వ్యాపారాలు కొనసాగిస్తున్న యజమానులు ఒకవైపు అయితే, దుకాణదారుల నుండి చెత్త పన్ను వసూలు చేస్తూ వారి నుండి చెత్తలను సేకరించకుండా ఉండడం వలన వ్యాపార వ్యర్థాలు కాలువల్లోనే మునిగిపోతున్నాయి. పేరుకుపోయిన చెత్తా చెదారం చిన్నపాటి వర్షం పడినా రోడ్లపైకి మురుగు రావడం పరిపాటిగా మారిపోయింది. తాయిలాలతో అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు అయితే ఉన్నాయి. రోడ్లపైకి మురుగు, చెత్త, వ్యర్థాలు రాకుండా కాలువల్లో మాత్రమే ప్రవహించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

ఆరిలోవ డంపింగ్ యార్డ్‌ను తరలించాలి: ఏఐవైఎఫ్

విశాలాంధ్ర - విశాఖ: డంపింగ్ యార్డ్ వ్యర్థాల వల్ల ముడసర్లోవ జలాశయం కలుషితం అవుతోందని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అచ్యుతరావు, వై.రాంబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐవైఎఫ్ ప్రతినిధి బృందం బుధవారం డంపింగ్ యార్డు, ముడసర్లోవ జలాశయాలను సందర్శించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షం పడినప్పుడు డంపింగ్ యార్డ్ నీరు, 13 వ వార్డ్ కృష్ణపురం ప్రాంత ప్రజలు వాడిన రోజువారి వాడుక నీరు కాలువలు ద్వారా జలాశయంలో కలుస్తున్నాయని తెలిపారు. ఆరిలోవ చుట్టు ప్రక్కల ప్రాంతాల ప్రజలకు డంపింగ్ యార్డ్ నుంచి వచ్చే దుర్వాసన వల్ల శ్వాసకోశ, క్యాన్సర్, ఇతర వ్యాధులు త్వరగా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆరోగ్య నిపుణులు పలుమార్లు వెల్లడించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శులు ఎన్.మధురెడ్డి, తూర్పు నియోజకవర్గ కార్యదర్శి కొమర సందీప్, అశోక్ పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ద్వారా 11 రకాల సర్టిఫికెట్లు

విశాలాంధ్ర - కశింకోట: మేజర్ పంచాయతీ కార్యాలయం సచివాలయం -1,3లో కశింకోట సర్పంచ్ మంత్రి జయ రజిని అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ రోజారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకం ద్వారా 11 రకాల సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు మాట్లాడుతూ మంత్రి గుడివాడ అమర్నాథ్ 2019 ఎలక్షన్‌లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మీ గన్నయ్య నాయుడు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, శ్రీనివాసరావు, గొల్లవిల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు, వార్డ్ మెంబర్లు, తహశీల్దార్ జి.సత్యనారాయణ, ఎంపీడీవో వివి రవికుమార్, కశింకోట పంచాయతీ ఈవో నల్లారి రమేష్, హౌసింగ్ ఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండిన వారిని ఓటరుగా నమోదు చేయాలి



విశాలాంధ్ర -యలమంచిలి: 2023 జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండనున్న వారిని ఓటరుగా నమోదు చేయించాలని యలమంచిలి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నేవి డిప్యూటీ కలెక్టర్ జ్ఞానవేణి సూచించారు. యలమంచిలి తహశీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలో గల నాలుగు మండలాల రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 21 నుంచి ఆగస్టు 25 వరకు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపడుతున్నామని చెప్పారు. కొత్తగా ఓటరు నమోదుతో పాటు మార్పులు-చేర్పులు, సవరణల కోసం దరఖాస్తులు తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి మండల తాశీల్దార్, ఎలక్ట్రోలర్ సహాయ అధికారి ఎస్.రాణీ అమ్మాజీ, ఎలక్షన్ ఆఫీసర్, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఏయూలో పారదర్శకంగా పీహెచ్‌డీల ప్రక్రియ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాల నుంచి పీహెచ్‌డీ పట్టా పొందే వరకు ప్రక్రియ ఎంతో పటిష్టంగా, పారదర్శకంగా జరుగుతుందని ఏయూ అకడమిక్ డీన్ ఆచార్య ఎస్. కిషోర్ బాబు అన్నారు. ఏయూ ఆచార్యులు ఒకరు వర్సిటీ పీహెచ్ ప్రవేశాలు, అవార్డులు మంజూరుపై చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు వర్సిటీ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా ఉన్నాయని వీటిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధ్యతాయుతమైన ఆచార్యునిగా పనిచేస్తూ విశ్వవిద్యాలయాన్ని కించపరుస్తూ విమర్శలు చేయడం సర్వీసు నిబంధనలను ఉల్లంఘనగా పరిగణించడం జరుగుతుందన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి



విశాలాంధ్ర - భీమిలి: ఆనందపురం మండలం శోంఠ్యం పంచాయతీ పరిధిలో ఉన్న పలు సమస్యలపై జనసేన నాయకులు భీమిలి శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు వినతి పత్రాన్ని సమర్పించారు. అందులో భాగంగా రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ సమస్య, పాఠశాల ప్రహరీ గోడ, మంచినీళ్లు, సిసి రోడ్లు, వాటర్ ట్యాంక్ సమస్య, కమ్యూనిటీ హాల్, ప్రభుత్వానికి భూములు ఇచ్చిన రైతులకి న్యాయం చేయాలని వినతి అందించారు. ఈ కార్యక్రమంలో శోంఠ్యము జనసేన నాయకులు బొద్దాపు గోవింద్, కోరుకొండ మూర్తి, తదితర జనసైనికులు పాల్గొన్నారు.

రాముడు... గోవిందుడు... ఏమీ చేయలేదు....

- మంగవరం గ్రామ అభివృద్ధిపై ఎమ్మెల్యే వద్ద దళితులు ఆవేదన

విశాలాంధ్ర - పాయకరావుపేట: ఎన్నికలు జరిగి మూడున్నరేళ్లు గడుస్తున్నా దళిత కాలనీలో అభివృద్ధి రాముడు (సర్పంచ్ భర్త వంగలపూడి రామారావు) ఏమి చేయలేదని, అలాగని గోవిందుడు (ఎంపిటిసి భర్త గూటూరు రామగోవిందు) ఏమి చేయలేదని మండలంలోని మంగవరం గ్రామంలో దళితులు ఎమ్మెల్యే గొల్ల బాబూరావు వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్, ఎంపిటిసి ఎన్నికలు జరిగిన తర్వాత ఎస్సీ కాలనీలో ఒక్క రూపాయి ఖర్చు చేయలేదని ఎమ్మెల్యేకు వివరించారు. దళిత కాలనీలో రోడ్లు, డ్రైన్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వర్షాకాలం పిల్లలతో మురికి నీటిలో నివాసం ఉండాల్సి వస్తుందని తెలిపారు. గత పదేళ్ల కాలంలో ఎస్సీ కాలనీ ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని తెలిపారు. ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికి తిరిగిన ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు మంగవరం దళిత కాలనీలో ప్రజలు ప్రశ్నల వర్షం కురిపించారు. పంచాయతీలో సుమారు రూ.30 లక్షలు నిధులు ఉన్నా రోడ్లు, డ్రైన్లు వేయడం లేదని మహిళలు వాపోయారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మాట్లాడుతూ రోడ్లు, డ్రైన్లు, శ్మశాన వాటికకు రోడ్డు, కమ్యూనిటీ హాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, జడ్పీటీసీ లంకా సూర్యనారాయ, జిల్లా ప్రచార కమిటి విభాగం అధ్యక్షులు దగ్గుపల్లి సాయిబాబా, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ గూటూరు శ్రీనివాసరావు, జగతా శ్రీను, వంగలపూడి రామారావు, గూటూరు రామగోవిందు, ఇసరపు తాతారావు, ఎంపిటిసి కొంతం నరేష్, దేవవరపు రాజేష్ ఖన్నా, అశోక చక్రవర్తి, గదుల లోవరాజు, రామాల శ్రీను, పక్కుర్తి లోవకుమార్, కేశనకుర్తి సత్తిబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సమస్యలు చెప్పుకోనివ్వరా?

గ్రామంలోని పలు సమస్యలను విన్నవించుకునేందుకు వచ్చిన యువకులను ఎమ్మెల్యేను కలవకముందే పోలీసులు అడ్డగిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓటేసి గెలిపించుకున్న ప్రజాప్రతినిధులను ప్రశ్నించే, సమస్యలు విన్నవించుకునే హక్కు లేదా అని ప్రశ్నిస్తున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగవరం ఎస్సీ కాలనీలో సమస్యలపై ఎమ్మెల్యేని నిలదీసేందుకు వెళ్లిన ఒక యువకుడిని ఎస్సై జోగారావు ఆధ్వర్యంలో పోలీసులు మధ్యలోనే అడ్డుకున్నారు. అంతే గాక వాగ్వివాదానికి దిగారు. గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలను నిలదీసే కార్యక్రమాలు జరుగుతాయని తెలిసే బహుశా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపం వాలంటరీ వ్యవస్థ

విశాలాంధ్ర - నర్సీపట్నం: గ్రామ సచివాలయ వ్యవస్థ, వాలంటరీ వ్యవస్థలు ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేస్తున్నాయని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన గ్రామ, వార్డ్ సచివాలయం, వాలంటరీ వ్యవస్థలు, చరిత్ర సృష్టిస్తున్నాయని అన్నారు. నర్సీపట్నం మున్సిపాలిటీ ఎనిమిదవ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని, వార్డ్ కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనపై అన్ని వర్గాల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ తమరన అప్పల నాయుడు, జగనన్న సచివాలయల కన్వీనర్ తమరాన శ్రీను, శాలివాహన కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ అర్జున, ముస్లిం సంచార జాతుల స్టేట్ డైరెక్టర్ చోటీ, మున్సిపల్ కౌన్సిలర్లు వీరమాచినేని జగదీశ్వరి, బుల్లిదొర, సిరసపల్లి నాని, చినబాబు, కో ఆప్షన్ కౌన్సిలర్ షేక్ రోజా, ఎండి భాష, దుర్గమ్మ, ఆలయ డైరెక్టర్ కొణతాల వరలక్ష్మి, 22వ వార్డ్ ఇం చార్జి కనితి అన్నపూర్ణ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శారద, 24వ వార్డ్ ఇన్‌చార్జ్ దేవత అరుణ, దనిమిరెడ్డి ప్రసాద్, టౌన్ వైసీపీ అధ్యక్షుడు ఏకాశివ, యాదగిరి శేషు, తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజలకు న్యాయమే ప్రభుత్వం ధ్యేయం

విశాలాంధ్ర - ఆనందపురం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేద ప్రజలకు అందించడంతోపాటు జగనన్న సురక్ష ద్వారా లబ్ధిదారులు అందరికీ కూడా సర్టిఫికెట్లు ఇవ్వడమే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ ఉద్దేశమని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం జగనన్న సురక్షలో భాగంగా ఆనందపురం మండలం రామవరం, సొంత్యము గ్రామపంచాయతీలో విలేజ్ క్లినిక్ ప్రారంభించి మాట్లాడారు. రామవరం పంచాయతీకి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా 25 కోట్ల రూపాయలు ఖర్చు చేశామని తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 155 మందికి సర్టిఫికెట్లు అందజేశామని తెలిపారు. శోంత్యము గ్రామపంచాయతీలో 350 జగనన్న ఇల్లు ఇచ్చామని అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ లోకవరపు రామారావు, ఎంపీడీవో అడప లవరాజు, మండల పార్టీ అధ్యక్షులు బంక సత్యం, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, ఉపాధ్యక్షులు కోరాడ ముసలి నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు, కాకర్లపూడి శ్రీకాంత్, మణి శంకర్ నాయుడు, విద్యార్థి విభాగం అధ్యక్షులు రౌతు శ్రీను, సర్పంచ్ లంక రాంబాబు, ఎంపీటీసీ గౌలగాని కృష్ణ, పల్లదుర్గ, కోరాడ రమణారావు పాల్గొన్నారు.

డ్రాప్ ఔట్స్‌ను అరికట్టి బడిలో చేర్పించాలి

విశాలాంధ్ర - పద్మనాభం: అర్ధాంతరంగా మానివేసిన విద్యార్థులను గుర్తించి బడిలో చేర్పించే బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ పేర్కొన్నారు. బుధవారం ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం డ్రాప్ అవుట్ ఉన్న పది మంది విద్యార్థులను గుర్తించి ఆనందపురం 24 కాలనీ ,బుడగ జంగాల కాలనీ, పొడుగుపాలెం గ్రామాలను పర్యటించి విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడారు. బడిలో చేర్పించవలసిన బాధ్యత ప్రతి తల్లిదండ్రులపై ఉందన్నారు. కార్యక్రమంలో పొడుగుపాలెం ఎంపీటీసీ బంటుబిల్లి అప్పల స్వామి, ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పట్నాయక్ మాస్టర్, సత్యనారాయణ, అజమ్, భాస్కరరావు, శంకర్రావు మ్యాజిక్ బస్సు సిబ్బంది, రమేష్, రమణమ్మ వెల్ఫేర్ అసిస్టెంట్ పి.మనోహర్ పాల్గొన్నారు.

మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి చేయూత

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విధి నిర్వహణలో ఉంటూ ప్రాణాలు విడిచిన కానిస్టేబుల్ కుటుంబానికి పోలీస్ సిబ్బంది ఆర్థిక సహాయం అందించారు.

విశాఖపట్నం సిటీ జీఆర్పీలో డిప్యూటేషన్ మీద పనిచేస్తు డ్యూటీలో వుండగా మృతి చెందిన కానిస్టేబుల్ ఏ.కేశవరావు భార్య రమణమ్మకు రూ.4.40 లక్షలు అందజేశారు. విశాఖపట్నం సిటీ 2011 బ్యాచ్ 206 మంది కానిస్టేబుళ్లు ఒక్క రోజు శాలరీ సేకరించి ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం చేసినట్లు సీపీ సీఎం త్రివిక్రమ్‌వర్మ తెలిపారు.

అసంపూర్తిగా ప్రహరీ నిర్మాణం
పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర - అరకులోయ: కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా స్థానిక మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ కార్యాలయం, ప్రయోగశాల కార్యాలయంలో నిర్మించిన ప్రహరీ నిర్మాణ పనులు మధ్యలో నిలిచి పోవడంతో అసంపూర్తిగా ఉంది. దీంతో వ్యవసాయ శాఖ కార్యాలయ ప్రహరీ నిర్మాణ పనులు అసంపూర్తిగా దర్శన మిస్తుంది. వ్యవసాయ ప్రయోగశాలకు ప్రహరీ నిర్మాణ పనులను గుత్తేదారుడు ఏడాది క్రితం ప్రారంభించారు. సుమారు 85 శాతం పూర్తయిన తర్వాత పనులను ఆపేశారు. దీంతో సిబ్బంది, ప్రజలకు ఇబ్బందులు తప్పటం లేదు. ప్రహరీకి ముఖ్యమైన ప్రధాన గేటును కూడా ఏర్పాటు చేయకుండా వదిలేయడం విచారకరం. తక్షణమే సంబంధిత ఉన్నతాధికారి స్పందించి అసంపూర్తిగా ఉన్న ప్రహరి నిర్మాణ పనులను వేగవంతం చేసి పూర్తిగా నిర్మించాలని పలువురు గిరిజనులు, గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు.



92వ వార్డులో బెహరా పర్యటన

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ 92వ వార్డు బంటకాలనీలో జీవీఎంసీ కో ఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు పర్యటించి రోడ్లు, కాలువల స్థానిక సమస్యలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో 92వ వార్డు అధ్యక్షులు జి.అప్పలస్వామి నాయుడు, కంచిపాటి జగదీష్, జావాన శంకర్రావు, షేక్ వల్లి, అప్పలరాజు, చినబాబు, కంపర సత్తిబాబు, కంపర కోటేశ్వరరావు, గొంతిన నాగరాజు, దవల మోహన్, ఇ.వి.రమణ, కడిమి రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలతో ప్రజలకు మేలు

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 40వ వార్డు ఏకేసీ కాలనీలో 40, 63 వ వార్డులలో జగనన్న సురక్ష జరిగింది. పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అనుసరిస్తున్న విధి విధానాలు ప్రజలకు ఎంతో మేలు చేకూరుతున్నాయన్నారు. 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆడారి ఆనంద్ కుమార్ నియోజవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేస్తూ సొంత నిధులతో పెన్షన్ రాని వారికి పెన్షన్ ఇస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో ప్రియతమ నేత ఆడారి ఆనంద్ కుమార్‌ని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కలిదిండి బద్రీనాథ్, బోగవల్లి నాగభూషణం, ఎమ్మార్వో వీరభద్రరావు, సోమధుల సురేష్, వరపల మహేష్, నమ్మి శ్రీను పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న గ్రామ రెవెన్యూ అసిస్టెంట్‌లకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని ముంచంగిపుట్టు మండల సీఐటీయూ నాయకులు ఆధ్వర్యంలో బుధవారం మండల తహశీల్దార్ సర్సమ్మకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఉపాధ్యక్షులు పి.భీమ రాజు మాట్లాడుతూ వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలని, 60 సంవత్సరాలు పైబడిన ప్రతి వీ.ఆర్.ఏ లకు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సేవకుల సంఘం మండల అధ్యక్షులు మండి చిన్నబాబు, కె.పరశురామ్, లోహిదాస్, శ్యామ్, గసన్న గోలమ్మ, సతీష్, పవన్, మోహన్ పాల్గొన్నారు.

హ్యాపీ కిడ్స్ ప్లే స్కూల్లో అంతర్జాతీయ చంద్ర దినోత్సవం

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: స్థానిక వుడ్ పేట హ్యాపీ కిడ్స్ ప్లే స్కూల్లో అంతర్జాతీయ చంద్ర దినోత్సవం సందర్భంగా చంద్రయాన్ 3 విజయ యాత్ర పరిపూర్ణం కావాలని ఆకాంక్షిస్తూ కరస్పాండెంట్ శేశెట్టి గిరీష్ కుమార్, ప్రిన్సిపాల్ సునీత, సిబ్బంది, చిట్టి పొట్టి చిన్నారులంతా భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ చైర్మన్ సోమనాథ్‌కి, శాస్త్ర వేత్తలకు, ఇతర సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు.

కరస్పాండెంట్ గిరీష్ కుమార్ చంద్రయాన్ 3 నమూనాను చిన్నారులకు చూపిస్తూ రాకెట్లను, ఉపగ్రహాలను నింగిలోనికి ఏ విధంగా పంపిస్తారు వివరించారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల చిన్నారులలో స్ఫూర్తి కలిగి భావిభారత శాస్త్ర వేత్తలుగా ఎదిగే అవకాశం ఉంటుందని ప్రిన్సిపాల్ సునీత తెలియజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఏఈ మల్ల చిన్నారావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సతీష్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలోనే అభివృద్ధి

విశాలాంధ్ర - చీడికాడ: గత ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధిని విస్మరిస్తే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం విస్తృతస్థాయిలో పలు పథకాలు ప్రవేశపెట్టి అభివృద్ధి చేసిందని ఎంపీపీ కూరచా జయమ్మ అన్నారు. మండలంలోని జైతవరం గ్రామంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. జగనన్న సురక్షపథకం ద్వారా ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువపత్రాలు పైసా ఖర్చు లేకుండా ప్రజల ఇంటి వద్దకే అందిస్తున్నామన్నారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాలలో తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి లాలం శారదావరలక్ష్మి, జానకిరామ్, మండల సచివాలయ కన్వీనర్ ఈర్లి చైతన్య, సర్పంచ్ కోదూరు సత్యవతి, తహసీల్దార్ బివి రాణి, ఎంపీడీవో జయప్రకాశరావు, వ్యవసాయధికారిణి కృష్ణవేణి, పశువైద్యురాలు గాయత్రిదేవి, పంచాయతీ కార్యదర్శి గోపి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం

విశాలాంధ్ర - హుకుంపేట: జాతిపిత మహాత్మ గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సిఎం జగన్ మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థతోనే సాధ్య పడిందని అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. బుధవారం మండలంలోని కొట్నాపల్లి పంచాయితీ కేంద్రంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆయన స్థానిక జెడ్పిటిసి, ఎంపీపీ, మండల నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ముందుగా ఏర్పాటు చేసిన శిలాఫలకలను ఆవిష్కరించి, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం అన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామల్లో గిరిజనులకు సమస్యలు తీరిందన్నారు. ఇంటివద్దకే పాలన జరుగుతుందన్నారు. గ్రామల్లో సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా అన్ని రకాల సమస్యలకు సచివలయం వ్యవస్థతోనే సాధ్య పడిందన్నారు. ఈ కార్యక్రమంలో జేడ్పిటీసీ మత్యలింగం, ఎంపిపి కూడా రాజుబాబు, పంచాయితీరాజ్ డీఈ ఆర్.రమమ్, ఏఈ ఎస్.సంజీవరావు, మండల అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, జేసీయస్ మండల ఇంచార్జీ రామకృష్ణా, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మెన్ కోండలరావు,మాజీ ఎంపిపి బత్తిరి రవిప్రసాద్, సర్పంచ్లు కాకరి బొంజుబాబు, సమీడ వెంకట పూర్ణిమ, పంచాయతీ కార్యదర్శి పి.సుధారాణి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాజారవీంద్ర పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అందరికీ మేలు

విశాలాంధ్ర - హుకుంపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకం ద్వారా గిరిజనుల సమస్యలకు చెక్ పడిందని, దీంతో అందరికి మేలు జరుగుతుందని ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. బుధవారం మండలంలోని రంగశీల పంచాయితీ కేంద్రంలో అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పర్యటించారు. ఈ నేపథ్యంలో స్థానిక సచివలయ కేంద్రంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన హాజరై గిరిజనులకు 542 దృవపత్రాలు పంపిణీ చేశారు. శోభకోట పంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమంలో స్థానిక జేడ్పీటీసీ రేగం మత్స్యలింగం, ఎంపీపీ కూడ రాజుబాబు చేతుల మీదుగా గిరిజనులకు 589 ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజ్యలక్ష్మి, ఆర్ఐ రంగారావు, పంచాయతీరాజ్ ఏఈ ఎస్.సంజీవరావు, ఐసిడిఎస్ సిడిపిఓ బాలచంద్రమణి దేవి, ఈవోపీఆర్డి అశోక్ కుమార్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో మూర్తి, ఎంపీటీసీ సుశీల, సర్పంచులు తాంగుల ముత్యాలమ్మ, వెంకటపూర్ణిమ, పంచాయతీ కార్యదర్శులు అనసూయ, ప్రదీప్ చంద్ర, రామస్వామి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - డుంబ్రిగుడ: మండలంలోని కించుమండ పంచాయతీ గ్రామాల్లో విద్యుత్ సౌకర్యానికి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ సర్పంచ్ హెచ్‌బి చెల్లమ్మ కోరారు. బుధవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఒకటే పీడర్ ఉండటం వల్ల మరమ్మతుకు గురైనప్పుడు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో విద్యుత్ సమస్య ఏర్పడుతుందన్నారు. పగలు పూటకూడా విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ఆన్లైన్ సెంటర్లు నడిపే వారు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ సౌకర్యానికి అంతరాయం ఏర్పడకుండా ప్రత్యేక బ్రేకర్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నట్లు ఆమె చెప్పారు.

ఏయూతో ఎంవిఆర్ డిగ్రీ కళాశాల ఎంఓయూ

విశాలాంధ్ర- గాజువాక: ఆంధ్రవిశ్వవిద్యాలయంతో గాజువాకకు చెందిన ఎం. వి. ఆర్ డిగ్రీ కళాశాల అవగాహన ఒప్పందం చేసుకుంది. బుధవారం ఉదయం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలపై ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. కృష్ణమోహన్, ఎం.వి.ఆర్. డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ వి.రామారావులు సంతకాలు చేశారు. ఈ అవగాహన ఒప్పందంలో భాగంగా డిప్లమా ఇన్ యోగా, పీజీ డిప్లమా ఇన్ యోగా కోర్సులను నిర్వహిస్తారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాద రెడ్డి మాట్లాడుతూ నేడు యోగా ప్రపంచ దేశాలకు సైతం చేరువ అయిందని, అందరికీ చేరువ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎంవీఆర్ కళాశాల కోర్సుల నిర్వహణకు ముందుకు రావడం పట్ల అభినందించారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి ఈ కోర్సులను ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య కె. సమత, అకడమిక్ డీన్ ఆచార్య ఎస్. కిషోర్ బాబు, యోగా విభాగాధిపతి ఆచార్య కె. రమేష్ బాబు, ఎంవీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గోమంగి మినీ గురుకులంలో మౌళిక సదుపాయాలు కల్పించాలి

విశాలాంధ్ర - పెదబయలు: గోమంగి మినీ గురుకులంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని బీజేవైఎం అరకు పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాంగి మత్స్య కొండ బాబు డిమాండ్ చేశారు. ఇటీవల గోమంగి మినీ గురుకులంపై వస్తున్న వార్త కథనాలపై వాస్తవాలు తెలుసుకునేందుకు బుధవారం పెదబయలు బీజేవైఎం మండల అధ్యక్షులు పూజారి ఈశ్వర్ రావుతో కలిసి అయన గోమంగి మినీ గురుకులంను సందర్శించామని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినిలతో, అధ్యాపకులతో వేర్వేరుగా అయన సమావేశం నిర్వహించి, భోజన నాణ్యత ప్రమాణాలను పరిశీలించామన్నారు. అనంతరం అయన మాట్లాడుతూ మినీ గురుకులం స్పెషల్ ఆఫీసర్ పై వస్తున్న వార్తల్లో ఏమాత్రం నిజం లేదన్నారు. ఈ సంవత్సరం మినిగురుకులం స్పెషల్ ఆఫీసర్‌గా చంద్ర కళ అనే ఉపాధ్యాయిని ఇంకా ఛార్జ్ తీసుకోలేదన్నారు. పాఠశాలలో మెనూ ప్రకారమే భోజనం పెడుతున్నారని అక్కడ విద్యార్థులు తమకు తెలిపారన్నారు. అయితే మినీ గురుకులంలో మౌళిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షులు పూజారి ఈశ్వర్ రావు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎండీఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - చోడవరం : పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన పథకం బడ్జెట్ పెంచాలని, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన పథకం మహిళా కార్మికులు బుధవారం మండల కార్యాలయాన్ని ముట్టడించారు. ఏ.పి. ఎం.డి.ఎం. కార్మికుల సంఘం అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద పేరుతో ఇస్తున్న మెనూ చార్జీలతో సంబంధం లేకుండా రోజుకో పద్ధతి వలన మహిళా కార్మికులకు పథకం నిర్వహణ కష్టంగా మారిందన్నారు. న్యాయపరమైన తమ సమస్యల పరిష్కారం కోరుతూ మండల విద్యాశాఖాధికారి కి మెమొరాండం అందజేశారు.

జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారం

విశాలాంధ్ర - పెదబయలు: జామికూడా గ్రామపంచాయతీలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎల్.పూర్ణయ్య ఆధ్వర్యంలో జగనన్న సురక్ష నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక జడ్పిటిసి కూడా బొంజు బాబు హాజరై మాట్లాడుతూ అతి మారుమూల గ్రామ సచివాలయమైన జామికూడాలో 730 మందికి దృవపత్రములను జారీ చేయడం చాలా గొప్ప విషయమని అన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకి వారి ఇంటికే అందించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మాజీ ఎంపీపీలు జర్సింగి సూర్యనారాయణ, చల్లంగి ఉమామహేశ్వరరావు, వైకాపా సీనియర్ నాయకులు గంపరాయి సూరయ్య, అప్పారావు, పాంగి సింహాచలం, మండల కన్వీనర్ గంపరాయి అజయ్ కుమార్ పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - యస్.రాయవరం: జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ రాయవరం జెడ్పిటిసి కాకర దేవి అన్నారు. బుధవారం మండలంలోని చిన్న గుమ్ములూరు ధర్మవరం గ్రామాల్లో జగనన్న సురక్ష గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న గుమ్ములూరు గ్రామంలో జరిగిన సమావేశంలో జడ్పిటిసి మాట్లా డుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో రామచంద్రమూర్తి, తహసిల్దార్ విజయకుమార్, డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్, మండల వైసీపీ కన్వీనర్ కొణతాల శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ గాడి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

టీడీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత

విశాలాంధ్ర - పాయకరావుపేట: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాల మేనిఫెస్టోని ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత తెలిపారు. టిడిపి నాయకులు, బూత్ ఇన్‌ఛార్జిలు, క్లస్టర్ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. అనిత మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వం హయాంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలన్నారు. ప్రస్తుత వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. ఓటర్ వెరిఫికేషన్ సక్రమంగా నిర్వహించాలని, 18ఏళ్ల దాటిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమమంలో పార్టీ మండల అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షులు పెదిరెడ్డి శ్రీను, వంకా రమణ, మల్లపురెడ్డి రమాకుమారి, బొంది కాశీవిశ్వనాద్, కంకిపాటి వెంకటేశ్వరరావు, చిక్కాల శ్రీను, కురందాసు శివ, కీర్తి సీతారాం, పెదిరెడ్డి నాగ వెంకటరమణ, గుల్లా నాగరాజు, వేములపూడి అప్పారావు, ఏడిద సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీలేరులో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - సీలేరు: జీకే వీధి మండలం సీలేరులో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సర్పంచ్ కె.వల్లీప్రసాద్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీలేరు పంచాయతీ పరిధిలోని చాలా మందికి ఆధార్ కార్డులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు కూడా ఆధార్ కార్డులు లేకపోవడంతో పాఠశాలల్లో అడ్మిషన్‌లు ఇవ్వడం లేదన్నారు. సీలేరులో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని అధికార్లను కోరినప్ప టికీ ఇటీవల జగనన్న సురక్ష కార్యక్రమంలో ఒక్క రోజు మాత్రమే ఏర్పాటు చేశారని, ఈ కేంద్రాన్ని ఈ పంచాయతీ పరిధిలోని పూర్తి స్థాయిలో ఆధార్ నమోదు, మార్పులు, చేర్పులు అయ్యేంత వరకు ఇక్కడ ఉంటుందని చెప్పిన అధికార్లు మరుసటి రోజు నుంచే తీసేశార న్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికార్లు స్పందించి సీలేరులో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కోరారు.

మహిళలు ఆత్మగౌరవ ర్యాలీ



విశాలాంధ్ర - పాయకరావుపేట: తెలుగుదేశం పార్టీ నియోజవకవర్గ మహిళా అధ్యక్షురాలు మల్లపురెడ్డి రమాకుమారి ఆధ్వర్యంలో పట్టణంలో మహిళల ఆత్మ గౌరవ ర్యాలీ నిర్వహించారు. పాండురంగ స్వామి దేవస్థానం నుండి ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో మహిళలపై జరుగుతున్న దాడులు పెరిగిపోయాయని తెలిపారు. ఈకార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

జగనన్న సురక్షలో 1414 ధృవ పత్రాలు అందజేత

విశాలాంధ్ర - చోడవరం: మండలంలోని రెండవ మేజర్ పంచాయతీ అయిన్ గోవాడలో బుదవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో సుమారు 1414 ప్రభుత్వ ధృవ పత్రాలను స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మ శ్రీ చేతుల మీదుగా లబ్ధి దారులకు అందజేశారు. గోవాడ సర్పంచ్ యేదువాక అమ్మియ్యమ్మ అధ్యక్షతన ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో రాజకీయాలకు అతీతంగా ప్రజలందరికీ పారదర్శక పాలన అందించేందుకు 11 రకాల పౌర సేవలను ఉచితంగా అందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం గోవాడ లో కళ్యాణ మండపం నిర్మాణానికి సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారిణి రాజేశ్వరి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యేదువాక సత్యారావు, ఎం.పి.పి.గాడి కాసమ్మ, తహసీల్దార్ తిరుమల బాబు, ఓరుగంటి నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ తప్పిదాలే నిర్వాసితులకు శాపం: ఎమ్మెల్సీ అనంతబాబు

విశాలాంధ్ర - దేవీపట్నం : గత ప్రభుత్వం తప్పిదాలు నిర్వాసితులకు శాపంగా మారిందని ఎమ్మెల్సీ అనంత బాబు అన్నారు. పోలవరం పునరావాసం అధికారుల అలసత్వం శాపంగా మారి అన్ని ఆధారాలు ఉండీ అనర్హులుగా మారి బ్రతుకు జీవుడా అంటూ అధికారుల చుట్టూ కాళ్ళు అరిగేలా తిరిగినా పరిహారం కానీ పునరావాసం అందక కార్యాలయాలు చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని బాధిత నిర్వాసితులు వాపోయారు. అన్ని అర్హతలు ఉండీ అవాసానికి దూరమై అవస్థలు పడుతున్నామని వాపోయారు. దేవీ పట్నం మండలం ఇందుకూరుపేట తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నిర్వాసితుల పట్టాలు పంపిణీ బాధిత నిర్వాసితుల ఆందోళనలతో మారుమ్రోగింది. పూడిపల్లి గ్రామానికి చెందిన 318కుటుంబాలకు గోకవరం శివారు గుబ్బాలమ్మ గుడి వద్ద స్థల సేకరణ చేపట్టారు.అర్హత కలిగిన 318గాను 227లను అర్హులుగా గుర్తించారు. వీరందరికీ పునరావాసం లో సేకరించిన భూమిలో కొంత కోర్టు లో ఉండటంతో అర్హులందరికీ పునరావాసం కల్పించటంలో అధికారులు విఫలమయ్యారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎమ్మెల్సీ లను నిర్వాసితులు తమ సమస్యలు పరిష్కారం చేయాలని తమ గోడును విన్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామాన్ని ఖాళీ చేసి రెండేళ్లు అయిందని అర్ అండ్ అర్ ఇంతవరకు ఇవ్వలేదని ప్రస్తుతం మా బ్రతుకులు రోడ్డు మీద పడ్డాయని అదే గ్రామానికి చెందిన శివ ప్రసాద్ ఆవేదన వ్యంచేస్తున్నారు మిగిలిన 96 మందికి విచారణ విచారణ అంటూ కాలయాపన చేస్తున్నారు తప్ప నిర్వాసితులకు న్యాయం జరగటం లేదని గ్రామస్తులు వాపోయారు. శివారుకు ఎమ్మెల్యే ఎమ్మెల్సీ లచే పట్టాలు పంపిణీ కార్యక్రమం రసాభాసగా మారింది. అర్హులను అనర్హులను చేసి బాధిత నిర్వాసితుల జీవితాలతో అధికారులు చెలగాటం ఆడుతున్నారని భాదితులు వాపోతున్నారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో 227 మందికు పట్టాలు పంపిణి చేశారు. అందరికీ న్యాయం జరిగేలా చూస్తమని ఎమ్మేల్యే ఎమ్మెల్సీ లు బాధితులకు భరోసా ఇవ్వటంతో కొంత శాంతించారు. ఇఈ కార్యక్రమంలో జే సి ఎస్ మండల కార్యదర్శి కందుల బాబ్జీ, ఎంపిపి కుంజమ్ మురళీ, జెడ్పీటీసీ శీర్షం సత్య వేణి, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా చేపడితే కఠిన చర్యలు

ఎస్పీ తుహిన్ సిన్హా

విశాలాంధ్ర - చింతపల్లి: గిరిజన యువతి, యువకులు, వ్యాపారస్తులు గంజాయి రవాణా చేపడితే కఠిన చర్యలు తప్పవని అల్లూరి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. బుధవారం అదనపు ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్‌తో కలిసి పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ అల్లూరి ఏజెన్సీలో పరివర్తన ద్వారా గంజాయి సాగు, రవాణా, క్రయవిక్రయాలు నిర్మూలించడం జరిగిందన్నారు. ఒరిస్సా రాష్ట్రం నుంచి మల్కన్ గిరి, కోరాపుట్ ప్రాంతాల నుంచి అక్రమార్కులు అల్లూరి ఏజెన్సీ మీదుగా ఇతర రాష్ట్రాలకు గంజాయి తరలిస్తున్నారని, ఈ క్రమంలో అల్లూరి ఏజెన్సీలో వివిధ శాఖల సమన్వయంతో గంజాయి సాగును పూర్తిగా ధ్వంసం చేయడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. గంజాయి రవాణా చేస్తున్న ఇతర రాష్ట్రాలకు చెందిన వారిపై ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంతాలలో ప్రత్యేక పోలీస్ నిఘా ఏర్పాటు చేసామన్నారు. ఒడిశా రాష్ట్రం మల్కన్ గిరి, కోరాపుట్ జిల్లా పోలీస్ యంత్రాంగంతో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు జరుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సిఐ రమేష్, ఎస్సై అరుణ్ కిరణ్‌లు పాల్గొన్నారు.

పెరుగుతున్న శబరి, గోదావరి నదులు..

అప్రమత్తమైన అధికారులు

విశాలాంధ్ర - చింతూరు: గత రెండు రోజులుగా తుఫాను కారణంగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. అలాగే గోదావరి నది భద్రాచలం వద్ద 32 అడుగులు చేరి ఉధృతంగా ప్రవహిస్తుంది. చింతూరు వద్ద శబరి నది బుధవారం సాయంత్రానికి 28 అడుగులకు నీటిమట్టం చేరుకుంది. గురువారం ఉదయానికి అటు గోదావరి ఇటు శబరి నది నీటిమట్టం పెరిగే సూచనలు ఉన్నాయని అధికారులు సూచిస్తున్నారు. ఒరిస్సా, చత్తీస్గడ్ రాష్ట్రాల్లో కురిసిన వర్షాలకు శబరి నది ప్రవాహం పెరుగుతుంది. ఈ మేరకు రంపచోడ వరం ఐటీడీఏ పీవో సూరజ్ గనేరో విఆర్ పురం, చింతూరు మండలాల్లో విస్తృతంగా పర్యటించి అధికారులకు సూచనలు ఇస్తున్నారు. విఆర్ పురం వద్ద లాంచీలను సిద్ధంగా ఉంచారు. చింతూరు మండలంలో ప్రవహిస్తున్న సోకలేరు, కుయ్ గుర్ వాగు, జల్లి వారి గూడెం వాగు, చంద్రవంక వాగు పొంగి ప్రవహిస్తున్నాయి. బుధవారం రాత్రికి చింతూరు మండల కేంద్రానికి రాకపోకలు బందు అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. చింతూరు మండల కేంద్రంలో 11 పునరావాస కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. చింతూరు ఎండిఓ వెంకటరత్నం, తహశీల్దార్ కారం సుబ్బారావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ దేవయ్య, వీఆర్వోలు తమ టీంతో మల్లెతోట, ఉలుమూరు, కోడేరు, ముకునూరు గ్రామాల్లో పర్యటించి పునరావాస కేంద్రాలను సందర్శించారు. వరద సమయంలో గర్భిణీలు, వివిధ వ్యాధులతో ఉన్న రోగులను తరలించడానికి ఆయా సెక్టార్లో అంబులెన్స్‌లను సిద్ధం చేశారు. ఆయా గ్రామాల్లో వరద సహాయక బృందాలను అప్రమత్తం చేశారు. కల్లేరు గ్రామపంచాయతీ సెక్రటరీ సురేష్, వాలంటరీలతో ముంపునకు గురయ్యే కుయ్ గుర్ గ్రామంలో ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. వరద పరిస్థితిని హెచ్చరిస్తూ మైకుల ద్వారా ప్రచారం చేస్తున్నారు. చింతూరు మండల అధికారులతో పాటు గ్రామ పంచాయతీలో ఉన్న 41 మంది వాలంటరీలకు సమయాల వారీగా వరద సహాయక డ్యూటీలలో పాల్గొనాలని డ్యూటీ వేశారు. వరద పరిస్థితి ఇదిలా ఉండగా పోలవరం ప్రాజెక్టు వద్ద ఉన్న గేట్లన్నీ ఎత్తివేసినట్లు సమాచారం.

సమాజానికి శంకర్ ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం

మంత్రి గుడివాడ అమర్నాథ్

విశాలాంధ్ర - పెందుర్తి: సమాజానికి విశాఖ శంకర్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాద్ కొనియాడారు. జీవీఎంసీ 93వ వార్డు నాయుడుతోట వద్ద గల శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆత్మకూర్ యశోద సెంటర్ ఫర్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ పరిశోధన కేంద్రాన్ని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కంటి వైద్య పరిశోధనలో సెంటర్ ఫర్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ పరిశోధన కేంద్రం అనేక కీలక మార్పులకు దోహదపడుతుందన్నారు. కంటి ఆసుపత్రి నిర్వహణ తోపాటు వందలాది మంది విద్యార్దులకు సాంకేతిక విద్యనందిస్తున్న శంకర్ ఫౌండేషన్ సేవాతత్పరతను అభినందిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజ్ మాట్లాడుతూ శంకర్ ఫౌండేషన్ సమాజానికి చేస్తున్న సేవలను కొనియాడుతూ డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ కంటివెలుగు కార్యక్రమాలు అమలులో రాష్ట్రంలోనే ఉత్తమ కంటి ఆసుపత్రిగా పేరు సంపాదించుకోవడం అభినందనీయమన్నారు. కంటి వైద్య పరిశోధనలో అనేక కీలక మార్పులకు ఈ సెంటర్ ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆత్మకూరి కృష్ణ కుమార్ ఆహ్వాన సందేశమిస్తూ తన తండ్రి కీర్తి శేషులు ఆత్మకూరి శంకర్రావు ఆశయాలకు అనుగుణంగా శంకర్ ఫౌండేషన్, ట్రస్టీలు, డాక్టర్లు, ఉద్యోగులు సమాజానికి సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ జనరల్ మేనేజర్ కే.రాధాకృష్ణన్, డా. తమ్మినేని రవీంద్ర, డా.అజయ్ శర్మ, డా.నాశ్రీన్, డా.శిరీష, డా.కృష్ణ ప్రసాద్, డా.చల్లా, డా.కృష్ణ. డిజిఎం కే .బంగార్రాజు, ఆసుపత్రి ఉద్యోగులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

విశాలాంధ్ర - చింతూరు: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెం గ్రామంలో చింతూరు ఏఎస్పీ రాహుల్ మీన ఆదేశాల మేరకు చింతూరు సీఐ అప్పలనాయుడు పర్యవేక్షణలో మోతుగూడెం సబ్ ఇన్స్పెక్టర్ జి.గోపాలరావు వారి సిబ్బందితో బుధవారం మోతుగూడెం పోలీస్ స్టేషన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించగా గంజాయి పట్టుబడింది. మూడు కేసులలో 10 మంది ముద్దాయిలను రెండు కార్లను, మూడు టూవీలర్లను అదుపులోకి తీసుకున్నామన్నారు. మొత్తం మూడు కేసులలో 44 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని తెలియజేశారు. ఈ తనిఖీలలో రాజేశ్వరరావు, హెచ్‌సి ఎస్.సోమరాజు, రవికుమార్, రాజు, కానిస్టేబుల్ మురళి కృష్ణ, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

పురందేశ్వరిని కలిసిన తోట నగేష్

విశాలాంధ్ర - పాయకరావుపేట: బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలిగా నూతనంగా నియమితులైన దగ్గుపాటి పురందేశ్వరిని విజయవాడలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్ మర్యాద పూర్వకంగా కలిసారు. నూతనంగా ఎన్నికైన సందర్భంగా పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో పి.రవిరాజు, కోసూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

30న జనసేన సమావేశం

విశాలాంధ్ర - ఎటపాక: ఈనెల 30న రంప చోడవరం నియోజకవర్గ స్థాయి సమావేశం జరుగుతుందని ఈ సమావేశానికి జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్, అరకు పార్లమెంట్ ఇంచార్జి వంపూరి గంగులయ పాల్గొంటారని ఎటపాక జనసేన మండల అధ్యక్షులు మారాసు గంగాధర్ తెలిపారు. ఈ కార్యక్రమనికి క్రియాశీలక సభ్యత కిట్లను 11 మండలాలకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రంపచోడవరం నియోజకవర్గ మండల అధ్యక్షులు పోపోలు శ్రీను లీగల్ సెల్ ఉపాధ్యక్షులు కాకి స్వామి ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుందన్నారు.

వరద సహాయక చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - చింతూరు: వరద సహాయక చర్యలు తక్షణమే ఏర్పాటు చేయాలని ఐటీడీఏ ఏపీఓకు బిజెపి నాయకులు వినతిపత్రం అందజేశారు. వరదల సమయంలో గత సంవత్సరం ముంపు మండలాల ప్రజలు ముంపునకు గురై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గత వరదలు దృష్టిలో పెట్టుకొని నాలుగు మండలాలకు ముందుగానే సహాయ చర్యలు ఏర్పాటు చేయాలని, ప్రతి కుటుంబానికి 1 తార్ఫిలిన్ కవర్, కొవ్వొత్తులు, కిరసనాయిలు, మంచి నూనె, 50 కేజీల బియ్యం ముందుగా ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి పాయం వెంకయ్య, చింతూరు మండల బీజేపీ అధ్యక్షులు డివిఎస్ఎన్ రమణ రెడ్డి పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర - మాకవరపాలెం: రైతులు తప్పనిసరిగా పంట వివరాలను ఈ క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని మాకవరపాలెం మండల వ్యవసాయాధికారి చిరంజీవి సూచించారు. బుధవారం మండలంలో బయ్యవరం గ్రామంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ పంట నష్టం, ప్రభుత్వ రాయితీలు, ధాన్యం కొనుగోలు చేయాలంటే తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ రాజా, సిబ్బంది పాల్గొన్నారు.

10080 మందికి ధృవపత్రాలు జారీ

విశాలాంధ్ర - మాకవరపాలెం: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా 10080 దృవపత్రాలు పంపిణీ చేయడం జరిగిందని మాకవరపాలెం ఎంపీడీఓ అరుణశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 15 సచివాలయాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరాలు ముగిశాయన్నారు. వీటిలో అన్ని గ్రామాల నుంచి 10520 దరఖాస్తులు రాగా వాటిలో 10080దృవపత్రాలు పంపిణీ చేశామన్నారు.

బాబోయ్ పెట్రోల్ దొంగలు

విశాలాంధ్ర - ఆనందపురం: ఇప్పుడు ఎక్కడ చూసినా ఇది హాట్ టాపిక్ పెట్రోల్ దొంగలు వస్తారు వారి పని చక్కబెట్టుకొని చక్కగా గుట్టుచప్పుడు కాకుండా వెళ్ళిపోతారు. వివరాల్లోకి వెళితే వేములవలస జంక్షన్ నుంచి 400 మీటర్ల మీటర్ల దూరంలో బీవీ కల్లాలు పంచాయతీ పరిధిలో పంతులుగారి కాలనీలో నివాసముంటున్న స్థానికుల ఇంటి ప్రక్కనే పార్కింగ్ చేసుకున్న వాహనాలను టార్గెట్ చేసుకొని రాత్రి వేళలో మాత్రమే పెట్రోల్ దొంగతనాలు చేస్తున్నారు. వీరు టైం చూసుకుని రాత్రి 11 గంటలకు తెల్లవారుజామున 4 గంటలకు ముగ్గురు గ్రూప్‌గా వచ్చి ఒకడు చుట్టుపక్కల గమనిస్తూ ఇద్దరు పెట్రోలు కాజేస్తున్నారు. బైక్ మీద రావడం పెట్రోలు దొంగలించుకొని చక్కగా వెళ్లిపోవడం. ఈ సంఘటనలతో టూ వీలర్స్ వాహనదారులు బెంబేలు ఎత్తిపోతున్నారు. పెట్రోల్ దొంగల నుంచి విముక్తి కల్పించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

రైవాడ కాలువను సందర్శించిన ఇరిగేషన్ ఏఈఈ



విశాలాంధ్ర - చోడవరం: రైవాడ రిజర్వాయర్ కుడి ప్రధాన కాలువను చోడవరం ఇరిగేషన్ సెక్షన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) శ్రీదేవి బుధవారం పరిశీలించారు. ఏ.పి.రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చిన సాగు నీటి సమస్యలపై ఇరిగేషన్ ఏఈ లక్కవరం, సింహాద్రిపురం ఆయకట్టు రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్‌రావు సాగునీటి సమస్యలను వివరించారు. చోడవరం మండలంలో ఆయకట్టు రైతులకు సాగునీరు అందించేందుకు ఆయకట్టు భూముల విస్తీర్ణం ఆధారంగా సాగునీటి పంపకాలు (టెర్మ్ సిస్టమ్) అమలు చేయాలని, అదనంగా వృధా అవుతున్న నీటిని అరికట్టే చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.పి. రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పైలా రమేష్, లక్కవరం, సింహాద్రిపురం గ్రామాల రైతులు వేచలపు నారాయణ మూర్తి, బందారు నాయుడు, సబ్బవరపు వెంకటరమణ, సబ్బవరపు గోవింద్ పాల్గొన్నారు.

చంద్రబాబును సత్కరించిన ముస్లిం నేతలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో యూసీసీ పై ముస్లిం మతపెద్దలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పాల్గొని ముస్లింల యొక్క మనోభావాలు గురించి వారితో చర్చించడం జరిగిందని, ముస్లింల అభివృద్ధికి టిడిపి ఎప్పుడు కట్టుబడి ఉంటుందని, ముస్లిం ల పక్షపాతిగా టిడిపి వ్యవహరిస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్ కూడా పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముస్లింల అందరి తరఫున చంద్రబాబుని ఘనంగా సత్కరించారు.

లాలం భవానీని కొణతాల పరామర్శ

విశాలాంధ్ర-యలమంచిలి: ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన యలమంచిలి నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు లాలం భాస్కరరావు చిత్రపటానికి బుధవారం రాంబిల్లి మండలం లాలంకోడూరు గ్రామంలో గల భాస్కరరావు నివాసంలో మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లాలం భవానీని పరామర్శించి ధైర్యం చెప్పారు. లాలం భాస్కరరావు కుటుంబ సభ్యులు, పలువురు రాజకీయ నాయకులు, రాంబిల్లి టీడీపీ మండలాధ్యక్షులు వసంతవాడ దిన్ బాబులు ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

విశాలాంధ్ర - జి.మాడుగుల: పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ బదిలీపై వెళ్లిన నాయుడు ను సచివాలయ సిబ్బంది గ్రామ వాలంటీర్లు పలు పంచాయితీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఘనంగా సన్మానించారు. జి.మాడుగుల పంచాయతీ కార్యదర్శిగా నాయుడు సుదీర్ఘకాలంగా పనిచేసి గిరిజనులకు అందించిన సేవలపై కొనియాడారు. ఈ సందర్భంగా సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు నాయుడును ఘనంగా సన్మానించారు.

ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు నూర్ భాషా సంఘం శుభాకాంక్షలు

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజుని పెందుర్తి మండల నూర్ భాషా సంక్షేమ సేవా సంఘం సభ్యులు కలిసి పెందుర్తి నియోజకవర్గం టికెట్టిని వారి కేటాయించిన సందర్భంగా వారికి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. పెందుర్తి మండల ముస్లిం సంక్షేమ సేవా సంఘం భవన నిర్మాణం విషయమై చర్చించారు. దీనికి వారు సానుకూలంగా స్పందించి కలెక్టర్ నుంచి పర్మిషన్ తీసుకొని భవన నిర్మాణానికి నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

టీడీపీ శిక్షణ కార్యక్రమం

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: మండల టీడీపీ ఆధ్వర్యంలో రంపచోడవరం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి అధ్యక్షతన మండలంలోని ఎవిఎడిఎస్ కార్యాలయం నందు బుధవారం బూత్ ఇన్చార్జిలు, క్లస్టర్ ఇన్చార్జిలకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అక్రమంగా ఓటు బ్యాంకు నిర్వహించకుండా తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావాలని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు మేరకు రంపచోడవరం నియోజకవర్గంలో ఉన్న 11 మండలాల ఇన్చార్జిలకు క్లస్టర్ ఇన్చార్జిలకు ఈనెల 19వ తేదీ మొదలుకొని 21వ తేదీ వరకు శిక్షణ ఉంటుందన్నారు.

తెనుగుపూడి రోడ్డు మలుపులో లారీ బోల్తా

విశాలాంధ్ర - దేవరాపల్లి: విజయనగరం నుంచి తారువ గ్రామానికి విద్యుత్ స్తంభాల లోడుతో వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి బోల్తా కొట్టింది. తారువలో సబ్ స్టేషన్ నిర్మాణం కోసం విజయనగరం నుంచి స్పన్(పెద్దవి) విద్యుత్ స్తంభాల లోడుతో వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి తెనుగు పూడి గురుకుల కళాశాల సమీపంలో ఉన్న మలుపులో లారీ బోల్తా కొట్టింది. అయితే ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఎక్స్‌లేటర్ సహాయంతో లారీని బయటకు తీశారు.

గ్లోబల్ మారీ టైం ఇండియా సమ్మిట్ 2023 కర్టెన్ రైజర్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: గ్లోబల్ మారీ టైం ఇండియా సమ్మిట్ జిఎంఐఎస్- 2023 కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని ముంబైలో బుధవారం ప్రారంభించారు. కేంద్ర పోర్టుల నౌకాయాన జల రవాణా శాఖామంత్రి శర్బానంద సోనోవాల్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఢిల్లీలోని ప్రగతి మైదానంలో అక్టోబర్ 17 నుంచి 19 వరకు జిఎంఐఎస్ -2023 నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. నూతన పెట్టుబడి అవకాశాలను కల్పించడం, సుబతర వాణిజ్య విధానం మరియు వాణిజ్యంలో సహకారాన్ని పెంపొందించుకోవడం, సాంకేతిక, వైజ్ఞానిక విభాగాలలో భాగస్వామ్యాలను పెంపొందించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశంగా మేజర్ పోర్టుల చైర్ పర్సన్ వర్చువల్ గా ఈ కర్టెన్ రైజర్ లో పాల్గొన్నారు. విశాఖపట్నం పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం. అంగముత్తు, ఐఏఎస్, డిప్యూటీ చైర్ పర్సన్, సెక్రెటరీ విభాగాధిపతులు, అధికారులు ఈ సమావేశంలో వర్చువల్ గా పాల్గొన్నారు.

మునగపాకలో కలెక్టర్ పర్యటన

విశాలాంధ్ర - మునగపాక: మండల కేంద్రమైన మునగపాకలో బుధవారం కలెక్టర్ పర్యటించారు. ముందుగా తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్న కలెక్టర్ రవి పఠాన్ శెట్టి ఆధునీకరించిన కార్యాలయాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. సమీపంలో గల స్కూలును పరిశీలించి అక్కడ సదుపాయాలపై, విద్యా విధానంపై విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. స్వయంగా కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జయలక్ష్మి, ఎస్సై మహమ్మద్ అలీ పాల్గొన్నారు. అనంతరం కాకరపల్లి ఏపీ మోడల్ స్కూల్ ని సందర్శించారు. అక్కడ విద్యార్థులతో ట్రైబల్ బీట్ క్లాసులను వీడియో క్లాసులను కూడా పరిశీలించారు. ప్రతి క్లాస్ రూమ్ కి వెళ్లి విద్యార్థులతో ఉపాధ్యాయుల బోధన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పద్మా రమణి, ఎంఈఓ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మీనామృతం తయారీపై అవగాహన

విశాలాంధ్ర - జి.మాడుగుల: సోలభం పంచాయతీ రచ్చపల్లి, పెద్ద లంక గ్రామాలలో రైతు సాధికార సంస్థ జి మాడుగుల యూనిట్ ఇంచార్జ్ ఐ.మహేశ్వరి చేపల వ్యర్థాలతో మీనామృతం తయారు చేసే విధానాన్ని రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మీనామృతం 27 రోజులు మురగా బెట్టి 200 లీటర్లు వాటర్‌లో కలిపి పిచికారీ చెయ్యటం వలన మొక్కకు మంచి ఎదుగుదలకు అలాగే చీడ పీడలు, మొక్కలు బలానికి బాగుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, ఎర్రయ్య దొర, జాషువా పాల్గొన్నారు.

23న జీ తెలుగులో 'రావణాసుర' చిత్రం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: తెలుగు ప్రేక్షకులకు అంతులేని వినోదం అందించడంలో ఎప్పుడూ ముందుండే జీ తెలుగు ఈ వారం మరో కొత్త సినిమాతో వచ్చేస్తోంది. మాస్ మహారాజ రవితేజ నటించిన సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ 'రావణాసుర' సినిమాని వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ గా అందిస్తోంది. టాలీవుడ్ స్టార్ హీరో రవితేజ క్రిమినల్ లాయర్ రవీంద్రగా మెప్పించిన 'రావణాసుర', జూలై 23 ఆదివారం సాయంత్రం 6 గంటలకు, జీ తెలుగులో ప్రసారం కానుందని ఆ ఛానెల్ ప్రతినిధి చెప్పారు.

జగనన్న సురక్షలో 323 ధ్రువపత్రాలు పంపిణీ

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: రాజవొమ్మంగి మండలం అమీనాబాదు సచివాలయం పరిధిలో 323 కుల, ఆదాయ ధ్రువపత్రాలు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ యాదగిరేశ్వరావు తెలిపారు. సర్పంచ్ కించె వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం పేదల కొరకే పనిచేస్తుందని, సురక్ష పథకం ద్వారా ఎంతో మంది లబ్ధి పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటి సత్యనారాయణ, వైసిపి పార్టీ శ్రేణులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బండరాయి పడి మేకలు మృతి

విశాలాంధ్ర - హుకుంపేట: మండలంలోని కొట్నాపల్లి పంచాయతీ లోపాలం గ్రామంలో గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కొండచరియలు విరిగి బండరాళ్లు దొర్లుకుంటూ వచ్చి పశువులశాలపై పడటంతో అందులో ఉన్నటువంటి రెండు మేకలు మృత్యువాత పడగా మరికొన్ని పశువులకు స్వల్ప గాయాలతో బయటపడింది. లోపాలం గ్రామానికి చెందిన గుంటా గోవింద్ అనే రైతు పశువులను మేపడానికి తీసుకువెళ్ళి మంగళవారం సాయంత్రం పశువులను శాలకు తీసుకువచ్చారు. తిరిగి బుధవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షాలకు రాళ్లు దొర్లి పశువులసాలపై పడటంతో గ్రామస్తులు భయాందోళనతో బయటకు పరుగులు తీశారు. అయితే కొంత సమయం తర్వాత చూసేసరికి పశువులశాలపై పెద్ద బండరాయి పడి ఉంది. పూర్తిగా ధ్వంసమైన పశువుల శాలను బయటికి తీసి చూసేసరికి రెండు మేకలు విగతజీవులై పడి ఉంది. మిగతా పశువులు తప్పించుకుని స్వల్ప గాయాలతో బయటకు పరుగులు తీసాయి. నష్టపోయిన తమ కుటుంబాలకు ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు వాహనదారులు సహకరించాలి

విశాలాంధ్ర - చింతపల్లి: రహదారి ప్రమాదాలు సంభవించకుండా, మండల కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణకు వాహనదారులు పోలీస్ శాఖకు సహకరించాలని అల్లూరి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. బుధవారం చింతపల్లి డివిజనల్ ఏ ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ అధ్యక్షతలో పోలీస్ సమావేశ మందిరంలో ఆటో యూనియన్ నాయకులు, వివిధ వాహనాల యజమానులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మండలం పోలీస్ భద్రత బ్యారక్ నిర్మాణానికి ప్రత్యేక పూజలు నిర్వహించి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు రహదారులకు ఇరువైపులా ఎక్కడ బడితే అక్కడ వాహనాలు నిలపరాదని, ప్రత్యేక పార్కింగ్ కేంద్రాల్లో నిలుపుదల చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. రహదారి భద్రత చట్టం ప్రకారం రహదారులలో వాహనాలు ప్రయాణించేటప్పుడు ముందు వస్తున్న వాహనాలను ఏ విధంగా ప్రయాణించాలో ముందు జాగ్రత్తతో ఉండాలన్నారు. రహదారి ప్రమాదాలు నివారణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ విషయంలో ప్రతి ఒక్కరూపోలీస్ శాఖకు సహకరించాలని సూచించారు. మహిళా సంరక్షకులు విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండకుండా తమకు అప్పగించిన బాధ్యతను శక్తి వంచన లేకుండా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సిఐ రమేష్, ఎస్ఐ అరుణ్ కిరణ్, గ్రామ సచివాలయ మహిళా సంరక్షకులు, వాహన డ్రైవర్లు, యజమానులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - పాయకరావుపేట: జగనన్న సురక్ష పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు కోరారు. మండలంలోని సత్యవరం, పెదరామభద్రపురం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, జడ్పీటీసీ లంకా సూర్యనారాయణ, సర్పంచ్ సకిరెడ్డి రాము, ఎంపిటిసీలు తమర్ని సత్యనారాయణ, కొంతం నరేష్, దేవవరపు రాజేష్‌కన్నా, గెద్దమూరి శ్రీనివాసరావు, గూటూరు వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ సాంబశివరావు, తహశీల్దార్ జయప్రకాష్, ఇన్‌ఛార్జి ఈఓపిఆర్‌డి వై.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వరదలు పట్ల పూర్తి అప్రమత్తత: మంత్రి అమర్నాథ్

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉధృతంగా కురుస్తున్న వర్షాలకు వరదలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి, అల్లూరి సీతారామరాజు జిల్లా ఇన్చార్జి మంత్రి గుడివాడ అమర్నాథ్ వెల్లడించారు. బుధవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ గత ఏడాది జూలై 9వ తేదీన శబరి నది ఉప్పొంగి చింతూరు ప్రాంతం అంతా జలమయమై, అనేక గ్రామాలు నీట మునిగాయని, వెంటనే ప్రభుత్వం స్పందించి అక్కడ ప్రజలకు పునరావాసం కల్పించిందని తెలియజేశారు. గత ఏడాది అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది ముందుగానే ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తాను అల్లూరి జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించానని అమర్నాథ్ చెప్పారు. అల్లూరి జిల్లాకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద నీటిని ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని, అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు కూడా రంగం సిద్ధం చేశామనిమంత్రి పేర్కొన్నారు. వరద ఉధృతి పెరిగినా, అల్లూరి జిల్లా ప్రాంత ప్రజలు ఇబ్బంది పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. వైద్య సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది అప్రమత్తం చేశామని ఆయన తెలియజేశారు.

ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసుల పరిష్కారం పట్ల ప్రజల్లో నమ్మకం కలగాలి

కలెక్టర్ డా. ఏ.మల్లికార్జున

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసుల విచారణను వేగవంతం చేసి, సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ.మల్లికార్జున పోలీస్, రెవెన్యూ అధికారులను సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ నూతనంగా ఎన్నిక కాబడిన సభ్యులతో ఈ సంవత్సరం మొదటి, ద్వితీయ త్రైమాసిక సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేసి ప్రజల్లో కేసుల పరిష్కారం పట్ల నమ్మకం పెంపొందించాలని అన్నారు. ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను, పెండింగ్‌కు గల కారణాలను పోలీస్ అధికారులతో చర్చించారు. సుదీర్ఘ పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించి తెలియజేయాలన్నారు. ఈ ఏడాది జిల్లాలో ఇప్పటివరకు 92 కేసులలో 88 మంది బాధితులకు రూ.1.15 కోట్ల పరిహారం చెల్లించినట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 95 కేసులు అండర్ ఇన్వెస్టిగేషన్ ఉండగా, 679 కేసులు పెండింగ్ ట్రయల్ దశలో ఉన్నాయన్నారు. అత్యధికంగా కుల ధృవీకరణ పత్రాలు పెండింగ్ ఉన్నాయని, కుల ధృవీకరణ పత్రాలు జారీచేసే విషయంలో ఆర్డీఓలు, తహశీల్దార్లు అలసత్వాన్ని ప్రదర్శించరాదన్నారు. జిల్లాలో ఏపీసీఆర్ పరిధిలో ఎస్సీ ఎస్టీ కేసులు 2013 నుంచి 2023 వరకు 97 కేసులు పోలీసు శాఖ ద్వారా విచారణలో ఉన్నాయని, ఈ కేసుల విచారణను సత్వరం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డీడీ కె.రామారావు, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్ రెడ్డి, డిసిపి నాగన్న, ఏపీపీలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ బివిఆర్ మూర్తి, ఐటిడిఏపిఓ ఎస్తేళ, కార్మిక శాఖ అధికారి, కమిటీ సభ్యులు పి.మల్లేశ్వరరావు, దాసరి సామ్యూల్, ఎ.రాజబాబు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలకు ప్రణాళికలు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: నియోజకవర్గంలో ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ చెప్పారు. అనకాపల్లి మండలం సిహెచ్.ఎన్ అగ్రహారంలో ఎంపీపీ గొర్లె సూరిబాబు ఆధ్వర్యంలో బుధవారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అమర్నాథ్ లబ్ధి దారులకు మంజూరైన పథకాలకు సంబంధించిన పత్రాలు అందజేశారు. గడపగడపకు వెళ్లి అక్కడ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలో కాలువలు, రోడ్ల నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేస్తున్నట్టు మంత్రి అమర్నాథ్ ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ అనకాపల్లి నియోజకవర్గాన్ని పారిశ్రామిక వాడగా తీర్చిదిద్దేందుకు ఇప్పటికే కార్యాచరణ ప్రారంభమైందని త్వరలోనే ఈ ప్రాంత వాసులకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని చెప్పారు. అలాగే చెరుకు పండించే రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకొని, రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను కల్పిస్తున్నా మని తెలియజేశారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు మరే ఇతర ప్రభుత్వం అందించలేదని, రాష్ట్రంలో ప్రజలు గత ప్రభుత్వంలో, ఈ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని బేరీజు వేసుకుని చూసుకుని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వైపే మొగ్గు చూపుతున్నారని మంత్రి అమర్నాథ్ చెప్పారు.

విద్యుత్ షాకుతో కాంట్రాక్ట్ కార్మికుడు మృతి

- స్మైలెక్స్ ఫార్మా కంపెనీలో ఘటన

విశాలాంధ్ర - పరవాడ: జవహర్లాల్ నెహ్రూ ఫార్మా సిటీలోని స్మైలెక్స్ ఫార్మా కంపెనీలో విద్యుత్ షాకుకు గురై కాంట్రాక్టు కార్మికుడు మృతి చెందారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అనకాపల్లి మండలం తగరంపూడి గ్రామానికి చెందిన ఎన్.నాగేశ్వరరావు(24) కంపెనీలోని ఫ్యాబ్రికేషన్ కాంట్రాక్టర్ వద్ద గత కొంతకాలంగా పనిచేస్తున్నారు. విధుల్లో భాగంగా బుధవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో వెల్డింగ్ పనులు చేస్తున్నారు. ఇంతలో గ్రైండింగ్ చేయడం కోసం గ్రైండింగ్ మిషన్ స్విచ్ ఆన్ చేయగా అది పని చేయలేదు. దీంతో మిషన్ను రిపేరు కోసం ఓపెన్ చేస్తుండగా విద్యుత్ షాక్ కు గురయ్యాడు. వెంటనే కంపెనీ యాజమాన్యం పీలా నగర్లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించిగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఇదిలా ఉంటే కార్మికుడి మృతిపై సమగ్ర విచారణ చేయాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. యాజమాన్యం నిర్లక్ష్యం వల్లనే కార్మికులు పిట్టల్లా రాలిపోతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకొని మృతి చెందిన కార్మిక కుటుంబానికి కోటి రూపాయలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామని గనిశెట్టి హెచ్చరించారు.

చట్టబద్ధతతోనే సాగు చేస్తున్నాం

శ్రీ కవిత అగ్రిఫార్మ్స్ భూ యజమాని అప్పారావు

విశాలాంధ్ర-దేవరాపల్లి: మండలంలో శ్రీకవిత అగ్రి ఫార్మ్స్ సాగులో ఉన్న భూములు అన్ని చట్టబద్ధంగా అనుమతులతో జిరాయితీ భూములు కొని సాగు చేసుకుంటే సిపిఎం నాయకుడు డి. వెంకన్న తమపై చేస్తున్న లేనిపోని ఆరోపణలను శ్రీ కవిత అగ్రి ఫార్మ్స్ అధినేత డి.వి అప్పారావు తీవ్రంగా ఖండించారు. స్థానిక విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. తాను కొన్న భూముల్లో సెంటు భూమి కబ్జా చేసినట్లు రుజువు చేస్తే, రెండు సెంట్లు భూమి తిరిగి ఇస్తానని సవాల్ చేశారు. శ్రీ కవిత అగ్రి ఫామ్స్ పేరుతో ఉమ్మడి ఉత్తరాంధ్రలో 600 ఎకరాల భూములు కొన్నామని, ఎక్కడ ఏ ప్రాంత ప్రజలను ప్రలోభ పెట్టి దోచుకోలేదన్నారు. మా సంస్థ పేరుతో అనేక సేవా,ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. చేతనైనంత వరకు సాయం చేయడం తప్పు.. ఎవరిని మోస గించే అవసరం లేదన్నారు. మారేపల్లి శారదా నది సమీపంలోని పాండవుల మెట్టపై పురాతన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు కోరారన్నారు. అంతేప్ప ఇక్కడ కొన్న భూములకు, ఆయనకు ఎటువంటి సంబంధం లేదన్నారు. సిపిఎం నాయకుడు వెంకన్న తన ఆర్థికం కోసం పదేపదే ఆరోపణలు చేస్తే సహించేది లేదని ఈ సందర్భంగా అప్పారావు హెచ్చరించారు. రెవెన్యూ రికార్డులు ఆధారంగా మారేపల్లి రెవెన్యూ పరిధిలోని అల్లు గౌరినాయుడు పేరు మీద సర్వే నెంబరు 115లో 23.15 ఎకరాల భూమి ఉందన్నారు. ఆ తర్వాత అతని వారసులపేరు మీద ఆభూమి వారసత్వంగా పొందారన్నారు. అప్పట్లోనే వారికి రెవెన్యూ అధికారులు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చారన్నారు. ఆ భూమిని 2016లో 1953కి ముందు నుంచి అల్లు గౌరి నాయుడు పేరు మీద రెవెన్యూ రికార్డులోనే ఉందన్నారు.

సింజెంటా ఇండియా కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: వరి, పత్తి, కూరగాయల రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రముఖ అగ్-టెక్ కంపెనీ సింజెంటా ఇండియా ఇన్సిపియో, సిమోడిస్ ను ఆవిష్కరించింది. ఈ సందర్భంగా సింజెంటా ఇండియా కంట్రీ హెడ్, మేనేజింగ్ డైరెక్టర్ సుశీల్ కుమార్ మాట్లాడుతూ ఈ అధునాతన ఉత్పత్తులు, వినూత్నమైన ఫినిజోలిన్ సాంకేతికత ఆధారంగా వివిధ తెగుళ్ల నుంచి పంటకు రక్షణను అందిస్తాయన్నారు. వాతావరణ మార్పులు, తెగుళ్ళ నిరోధకత నుంచి ఉత్పన్నమయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవటానికి ఇవి అభివృద్ధి చేశామన్నారు. ఇన్సిపియో ఒక హై - ఎండ్ క్రిమిసంహారక కొత్త జాతుల కాండం తొలుచు పురుగులు, ఆకు ఫోల్డర్లు, వరి పంటపై దాడిని సమర్థవంతంగా ఎదుర్కొంటాయన్నారు. సిమోడిస్ వరి, పత్తి, కూరగాయలను సికోకోటకాలు, చిమ్మట వంటి లెపిడోప్టెరా కీటకాల నుంచి రక్షణ అందిస్తుం దన్నారు. ఐఆర్ఏసీ ప్రకారం.. రైతులు ప్రతి సంవత్సరం తెగుళ్లు, వ్యాధుల కారణంగా సగటున 37 శాతం నష్టపోతున్నారన్నారు.

సహకార రంగం బలోపేతానికి కృషి

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: రైతులకు వ్యవసాయ పరపతి అందించడానికి అన్ని చర్యలు తీసుకోవాలని అల్లూరి సీతారామరాజు జిల్లా సంయుక్త కలెక్టర్ జె. శివ శ్రీనివాసు అధికారులకు సూచించారు. జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వ్యవసాయ, ఉద్యాన విని, మత్స్య, పశు సంవర్ధక శాఖ అధికారులకు, క్షేత్ర స్థాయి సచివాలయ సిబ్బందికి నిర్వహించిన వర్క్ షాప్‌లో ఆయన మాట్లాడుతూ సహకార చట్టం 1964లో ఏర్పాటు చేసారని, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రాజ్యాంగబద్ధంగా ఏర్పాటయ్యాయని పేర్కొన్నారు. వ్యవసాయ రుణాలపై రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. సహకార రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. జిల్లా సహకార అధికారి ఎం. వి. రామకృష్ణ రాజు, వ్యవసాయాధికారి ఎస్. బి. ఎస్.నంద్, జిల్లా ఉద్యాన వన అధికారి రమేష్ కుమార్ రావు, తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు క్షమాపణ చెప్పాకే జనసేన నాయకులు రోడ్లపై తిరగండి

విశాలాంధ్ర - జి.మాడుగుల: అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న జనసేన నాయకులు కళ్ళు ఉన్న కబోధులుగా వ్యవహరిస్తున్నారని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జి.మాడుగుల నాయకులు తీవ్ర స్థాయిలో విమర్శించారు. జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ జనసేన నిర్వహించిన ర్యాలీని ఖండిస్తూ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జి.మాడుగుల మండల అధ్యక్షులు నర్సింగ్ మత్స్యకొండం నాయుడు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు సురభిగ రామకృష్ణ, ల్యూవెనింగ్ ఎంపీటీసీ గబ్బాడి సన్యాసి దొర, జెసిఎస్ మండల ఇన్చార్జి లంకెల కళ్యాణ్, మాజీ సర్పంచ్ పూజారి దేముడునాయుడు తదితరులు విలేకరులతో మాట్లాడారు. ర్యాలీలో జనసేన నాయకులు ఇచ్చిన స్లొగన్స్ ను గుర్తు చేస్తూ అల్లూరి సీతారామరాజు జిల్లాలో గతకల రోడ్లు ఎక్కడున్నాయో చూపించాలని నిలదీశారు. పేద బతుకుల్లో వెలుగులు నింపింది జగన్మోహన్ రెడ్డి అవునా? కాదా? అనేది ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచించారు. పేద ప్రజలకు అద్భుత సేవలు అందిస్తున్న వాలంటీర్ వ్యవస్థను కించపరిచిన వ్యాఖ్యానించిన పవన్ కళ్యాణ్ మొదట ఆంధ్ర ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

భద్రతతోనే ప్లాంట్ ప్రగతి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: భద్రతతో విధులు నిర్వహించడం వలన ఉద్యోగులకు భద్రతతో పాటు ప్లాంట్ కూడా ప్రగతి పథంలో పయనిస్తుందని భద్రతా విభాగాధిపతి దువ్వూరి రామప్రసాద్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ఎల్ అండ్ డీసీ వద్ద ఉద్యోగి సేఫ్టీ ప్రొటెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కలిసి వ్యక్తిగత రక్షణ, అత్యవసర రెస్క్యూ పరికరాల ప్రదర్శనలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాంట్ భద్రత విషయంలో రాజీలేదని, భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీజీఎం (భద్రత) ఎం. వరప్రసాద్, మేనేజర్ (భద్రత) ఐ.వర్గీస్, ఉద్యోగులు, ట్రైనీలు పాల్గొన్నారు.

పురందేశ్వరిని కలిసిన పీతల మూర్తి యాదవ్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ దగ్గుపాటి పురందేశ్వరిని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ విజయవాడలో బుధవారం కలిసి అభినందించారు. రాష్ట్ర అభివృద్ధికి బిజెపి జనసేన కలిసి కృషి చేయాలని ఈ సందర్భంగా ఆమె సూచించినట్లు మూర్తి యాదవ్ తెలిపారు. ఇరు పార్టీల పొత్తు నేపథ్యంలో రానున్న ఎన్నికల్లో జనసేన బిజెపితో కలిసి పోటీ చేయనున్నామని ఆయన వెల్లడించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో పురందేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.

వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: ఎగువ ప్రాంతములో కురుస్తున్న భారీ వర్షాలు వలన గోదావరి నీటి మట్టం పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక తహసిల్దార్ ఎం.శ్రీధర్ ఓ పత్రిక ప్రకటనలో తెలిపారు. బుధవారం రాత్రికి 35 అడుగులు దాటే అవకాశము ఉన్నందున మండలం నందు గల నది పరీవాహక గ్రామాల ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సంబంధిత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్ళుటకు తెలియపరచాలన్నారు. వరద సహాయ చర్యల నిమిత్తము లాంచీ లను మర పడవలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందుకు సంబంధించి గ్రామ సచివాలయ సిబ్బందికి సెలవులు రద్దు చేసినట్లు తెలిపారు.

4828 ఎకరాల్లో సెంటు ప్లాట్ల అభివృద్ధి

విశాలాంధ్ర - విశాఖ : నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు కింద 4828 ఎకరాల్లో ఒక సెంటు ప్లాట్లను అభివృద్ధి చేస్తున్నామని వి ఎం ఆర్ డి ఏ మెట్రోపాలిటన్ కమిషనర్ వి రవీంద్ర, కార్యదర్శి సిహెచ్ రంగయ్య, చీఫ్ ఇంజినీర్ పి శివప్రసాద రాజు, చీఫ్ అర్బన్ ప్లానర్ కె. సంజయ్ రత్న కుమార్ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీఎంఆర్డీఏ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. 83 లేఅవుట్లలో లక్షా 41వేల 654 ప్లాట్లను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఇందుకోసం 175 కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నామన్నారు. లేఅవుట్ల అభివృద్ధిలో భాగంగా బోర్ వెల్స్, సిమెంట్ గోడౌన్లు, అప్రోచ్ రోడ్లు, తాత్కాలిక లైటింగ్ పనులు 30 కోట్లతో చేస్తున్నామని తెలిపారు. జగనన్న ఎంఐజి స్మార్ట్ టౌన్ షిప్ లే అవుట్ లలో ప్లాట్ల డ్రాకి సంబంధించి ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చిందని, త్వరలోనే కొన్ని లే అవుట్లకు డ్రా తీస్తామని చెప్పారు. విజయనగరం జిల్లా రఘుమండ టౌన్ షిప్ లో 91, విజయనగరం టౌన్ షిప్ లో 35, విశాఖ జిల్లా పాలవలస టౌన్ షిప్ లో 93, అచ్యుతాపురం టౌన్ షిప్ లో ఒక ప్లాట్ విక్రయించినట్లు తెలిపారు. ఆరు లే అవుట్ లలో 204.96 ఎకరాల్లో 1505 ప్లాట్లను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. వీఎంఆర్డీఏ కార్యాలయం ముందు భాగంలో 11 అంతస్తుల మల్టీ లెవెల్ కార్ పార్కింగ్, కమర్షియల్ భవనాన్ని 80 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్నామని తెలిపారు. ఐదు ఫ్లోర్లను పార్కింగ్ కోసం ఆరు ఫ్లోర్లను దుకాణాలు, కార్యాలయాల కోసం ప్రతిపాదించినట్లు చెప్పారు. 1.35 ఎకరాల్లో 80 కోట్ల రూపాయల వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నామని చెప్పారు.